# రాయలసీమ ప్రజల హక్కుల కోసం ఆందోళన చేద్దాం !

# ప్రాంతీయ వివక్షతనూ ముఠారాజకీయాలనూ వ్యతిరేకిద్దాం !

ప్రజలారా!

వెనుకబాటుతనానికి కరువుకు రాయలసీమ మారుపేరయింది. వ్యవసాయంలో, పరిశ్రమలలో, రవాణా సౌకర్యాలలో, అన్ని రంగాలలోనూ రాష్ట్ర సగటు కంటె రాయలసీమ వెనుకబడి ఉంది.

రాష్ట్రంలోని సాగు యోగ్యమైన భూమిలో దాదాపు 35 శాతానికి నీరందుతుండగా, రాయలసీమలో 17శాతం మాత్రమే సాగునీటి సదుపాయం కలిగి ఉంది. రాష్ట్ర జనాభాలో రాయలసీమ వాటా 17.5 శాతం కాగా రాష్ట్రంలోని రిజిష్టర్డ్ ఫ్యాక్టరీలలో 10శాతం మాత్రమే రాయలసీమలో ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తిలో 5 శాతం మాత్రమే రాయలసీమలో జరుగుతుంది. ప్రాజెక్టు జలాలలో 9 శాతం కంటె తక్కువే రాయలసీమకు అందుతున్నాయి. రాష్ట్రంలో సాగయ్యే వరిపంట ఉత్పత్తిలో కూడ 9 శాతంకంటె తక్కువే రాయలసీమలో సాగవుతూ ఉంది.

ఇటువంటి గణాంకాలు ఇంకా చాలా చెప్పుకోవచ్చు. ఈ గణాంకాలు మనకు చూపించేది కేవలం వెనుకబాటుతనాన్ని కాదు. ప్రాంతీయ వివక్షతనూ పాలకుల నిర్లక్ష్యాన్నీ ఇవి సూచిస్తాయి. ఒక ప్రాంతం వెనుకబడి ఉండడానికి గల కారణాన్ని ప్రకృతిమీద పెట్టేయడం సులభమే. రాయలసీమలో వర్షపాతం తక్కువ ఉందనీ అందువల్ల రాయలసీమ వెనుకబడి ఉందనీ అనడం సులభమే.

కానీ కృష్ణ, పెన్న, తుంగభద్ర నదీ జలాలు రాయలసీమకు తగు మోతాదులో ఎందుకు అందకుండ పోయాయని ప్రశ్నిస్తే దానికి సమాధానంగా ప్రకృతి వైపు వేలు చూపించడం సాధ్యంకాదు. ప్రకృతి ఈ నదులను రాయలసీమకు సన్నిహితంగా ఉంచింది. మనుషులే ఈ నదుల జలాలను రాయలసీమకు కాకుండ చేశారు.

ఇది ఎందుకు జరిగింది? ఎవరి నిర్లక్ష్యంవల్ల జరిగింది? ఎవరి ప్రయోజనాలను కాపాడడం కోసం జరిగింది? కరువు మండలాల జాబితాకు ఎక్కుతున్నదంటే దానికి బాధ్యులెవరు? పరిశ్రమల గురించి, రోడ్డు , రైలు మార్గాల గురించి, ఇటువంటి ప్రశ్నలే అడగవచ్చు. వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామిక పురోగతి కోసం మనదేశ ప్రభుత్వాలు అనేక సదుపాయాలు, రాయితీలు కల్పించాయి. అయినప్పటికీ రాయలసీమ పారిశ్రామికంగా వెనుకబడే ఉంది. ఎందుకుంది? పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చాలా అవసరం. అది రాయలసీమ విషయంలో ఎందుకు లేకుండా పోయింది?

రాయలసీమలోని రైల్వే వ్యవస్థ పారిశ్రామిక పురోగతికి ఎంతమాత్రం అనుకూలంగా లేదు. అసలు రాయలసీమకోసం వేసిన రైల్వేలైన్లు ఏవీ లేవు. మద్రాసునుండి బొంబాయికి పోయే లైను, హైదరాబాద్ నుండి బెంగుళూరుకు పోయేలైను, గుంటూరు నుండి బళ్లారికి పోయే లైను, కాకతాళీయంగా రాయలసీమమీదుగా పోతాయి. అస్తవ్యస్తమయిన ఈ రైల్వేవ్యవస్థ రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి ఎంతమాత్రం సరిపోదు.

ప్రాంతీయ సమానత్వం ఒక ప్రజాస్వామిక హక్కు. రాష్ట్రంలోని సహజవనరులు, వాటిని వినియోగించుకునే అవకాశాలు, అన్ని ప్రాంతాల ప్రజలకు సమానంగా దక్కాలి. అప్పుడే భాషాప్రయుక్త

రాష్ట్రాల ఏర్పాటులోని ప్రజాస్వామిక ఆకాంక్ష నిజమవుతుంది. ఈ ఎరుకతోనే రాయలసీమవాసులు 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం నుండి ఈనాటిదాకా తమ ప్రాంతానికి ఇతర ప్రాంతాలతో సమాన హక్కులు, సమాన అవకాశాలు దక్కాలని నొక్కి చెప్తున్నారు. కానీ దక్కింది శూన్యం. వ్యవసాయ పారిశ్రామిక ప్రగతి నుండి ఉద్యోగ అవకాశాల దాకా ఏదీ రాయలసీమకు సమంగా దక్కలేదు. ఈ అన్యాయాన్ని గురించి అన్ని ప్రాంతాల ప్రజలు ఆలోచించాలి. సోదరభావానికి సమాన అవకాశాలే పునాది అనీ ఒకరిని వెనక్కి నెట్టి మరొకరు ముందుకు పురోగమించడం ప్రజాస్వామిక ప్రగతి కాదనీ గుర్తించాలి.

అయితే రాయలసీమ కడగండ్లకు బాధ్యత పూర్తిగా ఇతర ప్రాంతాల వారిదేకాదు. రాయలసీమ సామాజిక జీవితంలో ముఠాతత్వాన్ని పెంచిపోషించిన స్థానిక నాయకుల ద్రోహం కూడ ఒక కారణమే. ప్రజల అభివృద్ధికంటె తమ పెత్తనమే ముఖ్యంగా భావించి ఆధిపత్యం, హింసారాజకీయాలను అలవరచుకొని ప్రజలను చీల్చి ముఠాలు కట్టి రాయలసీమకు బాంబుల సీమ అనీ హత్యల గడ్డ అనీ చెడ్డపేరు తీసుకొచ్చిన నాయకులు తమవంతుగా రాయలసీమను నాశనం చేశారు. వాళ్ల హింసాత్మక ఆధిపత్యం పోనిదే రాయలసీమలో ప్రజాస్వామ్య వాతావరణం ఏర్పడదు. అది ఏర్పడనిదే రాయలసీమ ప్రజలు తమకు జరిగిన, జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా సంఘటితమై పోరాడలేరు.

ప్రస్తుతం ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థలో పెద్ద పీటవేస్తున్న పెట్టుబడిదారీ మార్కెట్ సూత్రాలు వెనుకబడిన ప్రాంతాల పరిస్థితిని మరింత అధ్వాన్నం చేస్తాయి. ఇది బలవంతులకు మరింత బలం చేకూర్చి బలహీనులను మరింత బలహీనులు చేసే వ్యవస్థ. అందువల్ల ఇంక ఆలస్యం చేయకుండ రాయలసీమ ప్రజల హక్కులనూ జీవనాన్ని అభివృద్ధి అవకాశాలనూ మెరుగుపరిచే మార్గాల గురించి అందరమూ మాట్లాడుకోవాలి. కలిసి ఉద్యమించాలి.

## సదస్సు

**7 ఏప్రిల్ 1996 ఉదయం 10 గం॥ల నుండి**

**విద్యానగర్ కమ్యూనిటీ హాల్, విద్యానగర్ (బస్‌స్టాప్ వెనుక) హైదరాబాద్**

శ్రీ ఎం. శ్రీరామరెడ్డి (రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్)

ప్రొ॥ కె.ఆర్. చౌదరి (ఆం.ప్ర. వ్యవసాయ విశ్వవిద్యాలయం)

ప్రొ॥ ఎస్. శేషయ్య (ఎపిసిఎల్‌సి)

పి హెచ్. చంద్రశేఖర్‌రెడ్డి (రాయలసీమ కార్మిక కర్షక సమితి)

అందరికీ ఇదే ఆహ్వానం

రాయలసీమ ప్రజా సమితి